సాక్షి
పార్వతీపురం మన్యం

శుక్రవారం । 26 । జూలై । 2024



మృత్యు ఒడిలో విద్యార్థులు

మన్యంలో మలేరియా విజృంభిస్తోంది. విద్యార్థులపై దాడిచేసి అస్వస్థతకు గురిచేస్తోంది. కొందరిని మృత్యు ఒడికి చేర్చుతోంది.

-8లో



సాగునీటి కాలువలపై ప్రత్యేక పర్యవేక్షణ

తోటపల్లి ప్రాజెక్టు మట్టి కట్టలు, ప్రధాన కాలువలు కోతకు గురికాకుండా పర్యవేక్షించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ జల వనరుల శాఖ అధికారులను ఆదేశించారు.

-8లో

జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రులకు సంబంధించి 25 జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టులకు సంబంధించి ఇతర వివరాలు విజయనగరం.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూసుకోవాలన్నారు.

న్యూస్‌రీల్

పాఠశాలల్లో కిచెన్‌గార్డెన్‌పై ప్రత్యేక శ్రద్ధ




అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: పాఠశాలల్లో బడి తోటలు (కిచెన్ గార్డెన్) సాగుపై ప్రత్యేక శ్రద్ధచూపాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల బోధనా ప్రమాణాలతో మెరుగుపరచడంతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. రక్త హీనత నివారణ పట్ల దృష్టి సారించి, పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల ఆహారపు అలవాట్లలో మార్పులు తీసుకురావాలని ఆదేశించారు. బడితోటల్లో ఆకుకూరలు, క్యారెట్, బీట్ రూట్, చిక్కుడు వంటి పోషకాహారాలను పండించి మధ్యాహ్న భోజన పథకంలో వినియోగించాలని ఆయన చెప్పారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీలో పూర్తి అప్రమత్తంగా ఉండాలని, తాగునీరు పట్ల మరింత జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి ట్యాంక్‌లు ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉండాలని, రన్నింగ్ వాటర్ ఉండాలని స్పష్టం చేశారు. పాఠశాల పారిశుధ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని, అవసరమైతే చెత్త బుట్టలు పెట్టాలని ఆయన సూచించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థుల ఆరోగ్యానికి హాని చేసే తినుబండారాలు విక్రయాలపట్ల దృష్టి పెట్టాలన్నారు. పిల్లల్లో మంచి ఆహారపు అలవాట్లు వచ్చినపుడు ఆరోగ్యం బాగుంటుందని తద్వారా విద్యపై దృష్టి సారించగలరన్నారు. విద్యా బోధన పక్కాగా ఉండాలని, విద్యార్థుల ప్రమాణాలు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల పాఠ్యాంశాలు సకాలంలో పూర్తి చేయడమే కాకుండా నోట్ పుస్తకాలు, వర్క్ బుక్‌లు ఉపాధ్యాయులు పరిశీలించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం అలవాటు చేయాలని, సైన్స్ ఎగ్జిబిషన్‌లు తరచూ నిర్వహించాలని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడల్లో ప్రోత్సహించాలన్నారు. మండలాల్లో ఏ క్రీడలలో ఎక్కువ ఆసక్తి ఉన్నది గుర్తించి అటువంటి వాటిలో ప్రోత్సహించడం వలన సహజ నైపుణ్యంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మ, ఉపవిద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల తహసీల్దార్లు రిలీవ్

విజయనగరం అర్బన్: సాధారణ ఎన్నికల నిబంధనల నేపథ్యంలో పక్క జిల్లాల నుంచి వచ్చిన 22 మంది తహసీల్దార్లను రిలీవ్ చేస్తూ కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. విశాఖ, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి వీరంతా ఎన్నిక ముందు అప్పట్లో జిల్లాకు బదిలీపై వచ్చారు. రిలీవ్ చేసిన వారిలో విశాఖ పట్టణానికి చెందిన 11 మంది, శ్రీకాకుళం జిల్లాకి చెందిన 10 మంది, పార్వతీపురం మన్యం జిల్లాకి చెందిన వారు ఒక్కరు ఉన్నారు.

నీచుకవలసలో ఏనుగులు



నీచుకవలస పంట పొలాల్లో సంచరిస్తున్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని గౌరీపురం, చినకుదమ, పెదకుదమ పంట పొలాల్లో ఉన్న ఆరు ఏనుగులు శుక్రవారం నీచుకవలసకు చేరాయి. అరటి పంటను ధ్వంసం చేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారు. ఎనిమిది అడవి ఏనుగులకు హరి ఏనుగు కనిపించడం లేదని, వెంకటలక్ష్మి అనే ఏనుగు ఇటీవల మృతి చెందడంతో మిగిలిన ఆరు ఏనుగులు సంచరిస్తున్నట్టు అటవీశాఖ అధికారులు తెలిపారు. రైతులు పొలాలకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారు. అయితే, ఏనుగుల తరలింపునకు శాశ్వత చర్యలు చేపట్టాలంటూ రైతులు ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు.

సృజనాత్మక విద్యకు ప్రాధాన్యం

- యునిసెఫ్ ఏపీ ప్రతినిధి సుదర్శన్

చీపురుపల్లి: విద్యార్థులు సృజనాత్మక విద్యకు ప్రాధాన్యమివ్వాలని యునిసెఫ్ ఏపీ ప్రతినిధి సుదర్శన్ సూచించారు. చీపురుపల్లి పట్టణంలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఏర్పాటుచేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌తోపాటు, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ల్యాబ్‌ను సందర్శించారు. ల్యాబ్‌ల వినియోగంపై ఆరా తీశారు. ఆయన వెంట జిల్లా సైన్స్ అధికారి మిరియాల కృష్ణారావు ఉన్నారు.



రియల్టర్ల నోట.. రెల్లి మాట!



- కేంద్రియ గిరిజన విశ్వవిద్యాలయంపై కూటమి నాయకుల కన్ను
- సాలూరు నియోజకవర్గం నుంచి రెల్లికి తరలించాలని కుతంత్రాలు
- రెల్లి పరిసరాల్లో భారీ ఎత్తున లేఅవుట్‌లు
- రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కూటమి నేతల బంధువులు
- మళ్లీ వ్యాపారం పెంచుకోవడానికి ప్రయత్నాలు
- వర్సిటీ తరలింపునకు సీఎం చంద్రబాబు సై అన్నారని ప్రచారం
- ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని తెరపైకి తెచ్చి నాటకాలు
- టీడీపీ నేతల తీరుపై గిరిజనుల్లో ఆందోళన

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ప్రతిష్టాత్మకమైన కేంద్రియ గిరిజన విశ్వవిద్యాలయాన్ని రెల్లి నుంచి సాలూరు నియోజకవర్గానికి మార్చడమనేది గిరిపుత్రుల ఆకాంక్షలను గౌరవించడం. వారికొక గుర్తింపు ఇవ్వడం. వారి కుటుంబాల్లో విద్యాదీపం వెలిగించడం. కానీ కూటమి నేతలకు మాత్రం రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రయోజనాలే పరమావధి అవుతోంది. కేవలం స్థిరాస్తి వ్యాపారాన్ని పెంచుకోవాలనే కుతంత్రంతోనే ఈ ఉన్నత విద్యాసంస్థను మళ్లీ రెల్లికి తరలించుకుపోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం అమల్లోభాగంగా 2014 సంవత్సరంలోనే కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి 13 కేంద్రియ విద్యాసంస్థలను మంజూరు చేసింది. వాటిలో ఏపీ కేంద్రియ గిరిజన విశ్వవిద్యాలయం (సీటీయూఏపీ)ను ఉమ్మడి విజయనగరం జిల్లాకు కేటాయించింది. అప్పటి టీడీపీ ప్రభుత్వం 2017 సంవత్సరంలో కొత్తవలస మండలంలోని రెల్లి గ్రామం వద్ద భూమి మంజూరుచేసింది. కానీ అది భారీ భవనాల నిర్మాణానికి అనుకూలంగా లేని పూర్తిగా ఏటవాలు కొండప్రాంతం. పరిసరాల్లో టీడీపీ నాయకులు, వారి బంధువులు, అనుయాయుల స్థిరాస్తి వ్యాపారాన్ని పెంచుకోవడానికి తప్ప మరెందుకూ ఉపయోగం లేకుండాపోయింది. చంద్రబాబు ప్రభుత్వం 2019 ఏప్రిల్ వరకూ అధికారంలోనే ఉన్నప్పటికీ భూసేకరణను పూర్తి చేయలేదు. ప్రభుత్వ భూమిలో మాత్రం కొంతమేర ప్రహరీ నిర్మించి వదిలేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీటీయూఏపీ తరగతులను తప్పనిసరిగా ప్రారంభించాల్సి వచ్చింది. విజయనగరం పట్టణ శివారు కొండకరకాం వద్దనున్న ఆంధ్రా విశ్వవిద్యాలయం పీజీ క్యాంపస్ పాత భవనాన్ని కేటాయించడంతో 2019 ఆగస్టు 5న తరగతులు ప్రారంభమయ్యాయి.

గిరిజన ప్రాంత మణిహారంగా...

గిరిజన వర్సిటీ లక్ష్యం సార్థకమయ్యేలా గిరిజన ప్రాంతంలో ఏర్పాటుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంకల్పించింది. మెంటాడ మండలం చినమేడపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో 224.01 ఎకరాలు, దత్తిరాజేరు మండలం మర్రివలస రెవెన్యూ గ్రామ పరిధిలో 337.87 ఎకరాలు మొత్తం 561.88 ఎకరాల భూసేకరణను శరవేగంగా పూర్తి చేసింది. ఇది విశాఖపట్నం–రాయగడ జాతీయ రహదారికి, విశాఖ–హౌరా రైల్వేలైనులోని విజయనగరం, గజపతినగరం, బొబ్బిలి రైల్వేస్టేషన్లకు సమీపంలో ఉంది. ప్రస్తుతం నిర్మాణంలోనున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కూడా దగ్గరే. సీటీయూఏపీకి కేటాయించిన ఈ భూమిని 2022లో పరిశీలించిన కేంద్ర బృందం పూర్తి సంతృప్తిని వ్యక్తం చేసింది. సీటీయూఏపీ పాలకవర్గం ఆమోదముద్ర వేసింది. మౌలిక వసతులను కల్పించడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.23.60 కోట్లను గత ఏడాదే విడుదల చేసింది.

కేంద్రియ గిరిజన విశ్వవిద్యాలయం చట్టం నిబంధనల ప్రకారం గిరిజనుల చెంతన, ఎస్టీ రిజర్వుడు సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేటాయించిన 561.88 ఎకరాల విస్తీర్ణంలోని భూమి ఇది. ప్రకృతిరమణీయతతో అన్నివిధాలా అనువైందని స్వయంగా పర్యటించిన కేంద్ర ప్రభుత్వ అధికారులే సంతృప్తి వ్యక్తం చేశారు. యూనివర్సిటీ పాలకవర్గం కూడా ఆమోదముద్ర వేసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి 2023 ఆగస్టు 25న అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మెంటాడ మండలం కుంటినవలస వద్ద శంకుస్థాపన చేశారు. అంతేగాకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.23.60 కోట్లు మౌలిక వసతుల కల్పనకు కేటాయించింది. భూసేకరణకు సంబంధించి రైతుల నష్టపరిహారం పంపిణీ కూడా పూర్తి అయ్యింది. భవన నిర్మాణ పనులకు అన్నివిధాలా సిద్ధంగా ఉంది.

టీడీపీ నేతల కుతంత్రాలు మొదలు...

శృంగవరపుకోట నియోజకవర్గంలోని కొత్తవలస మండలంలో సుమారు 20, ఎల్.కోట మండలంలో 16, జామి మండలంలో ఆరు, వేపాడ మండలంలో 12 లేఅవుట్‌లు ఉన్నాయి. వాటిలో ఎక్కువ టీడీపీ పెద్దనాయకుల బంధువులు, అనుచరులకు చెందినవే. విశాఖ ఎంపీ భరత్ బంధువులకు చెందినవీ అందులో ఉన్నాయి. 2014లోనే అక్కడ పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరదీశారు. ఒక్కొక్కటీ వందల ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్‌లు వేశారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం కొత్తవలస నుంచి తరలిపోవడంతో ఆ వ్యాపారం కాస్త మందగించింది. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యాపారం పెంచుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. వర్సిటీని వెనక్కి తెచ్చేస్తే తమ వ్యాపారం మూడు పూలు ఆరు కాయలుగా సాగిపోతుందని ఆశిస్తున్నారు. ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని తెరపైకి తెచ్చి నాటకాలు మొదలుపెట్టారు. ఇటీవల భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ పనులను పరిశీలించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాకు వచ్చినప్పుడు లలితకుమారి కలిశారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించారని ఆమె, ఆమె అనుచరులు ప్రచారం మొదలెట్టారు. టీడీపీ నాయకులు ఈ ద్వంద్వ వైఖరిపై గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్సిటీని తరలిస్తే ఉద్యమాలు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

అనువైన ప్రాంతం



ఉమ్మడి విజయనగరం జిల్లా లోని గిరిజన విద్యార్థులతో పాటు ఇటు ఒడిశా, అటు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల గిరిజన విద్యార్థులకు సాలూరు దగ్గర ప్రాంతం. గిరిజన సంస్కృతులు, అలవాట్లపై రీసెర్చ్ చేయడానికి అనుకూలంగా ఉంటుంది.

– వై.తిరుపతిరావు, గిరిజన విద్యార్థి సంఘ నాయకులు, మెంటాడ

ఇది కేంద్రియ గిరిజన విశ్వవిద్యాలయానికి 2017 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం కేటాయించిన భూములు. కొత్తవలస మండలం రెల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని అప్పన్నదొరపాలెం సమీపంలో నిర్మాణాలకు ఏమాత్రం అనుకూలంగాలేని కొండ ప్రాంతమిది. గిరిపుత్రుల జీవితాల్లో వెలుగునింపాల్సిన ఈ విద్యా సంస్థ గిరిజన ప్రాంతానికి సామీప్యంలో లేకపోయినా కేవలం మైదాన ప్రాంతంలోని రియల్ ఎస్టేట్ వ్యాపారం పెంచుకోవడానికి ప్రచారాస్త్రంగా ఇది ఉపయోగపడింది. 2014లో అధికారంలోకి వచ్చినా 2017 వరకూ యూనివర్సిటీ ఊసే టీడీపీకి లేదు. ఆ సంవత్సరం డిసెంబర్‌లో ప్రహరీ నిర్మాణానికి మొక్కుబడిగా అప్పటి మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆగమేఘాలపై శంకుస్థాపన చేశారు. ఆ ప్రహరీ కూడా కిలో మీటరు పొడవు కూడా నిర్మాణం జరగలేదు. 2019 ఏప్రిల్ వరకూ అధికారంలో ఉన్నా భూభాగం చదును ప్రక్రియ కూడా సాగలేదు.

ఉద్యమిస్తాం



ఎస్టీ రిజర్వుడు సాలూరు నియోజకవర్గంలోనే గిరిజన యూనివర్సిటీ ఉండాలి. గిరిజనేతర ప్రాంతానికి తరలిస్తే మేము ఒప్పుకోం. గిరిజనులమంతా ఉద్యమిస్తాం.

– సీదరపు అప్పారావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు

గిరిజన ప్రాంతంలోనే ఉండాలి



గిరిజన విశ్వ విద్యాలయం అంటే కేవలం డిగ్రీ, పీజీలు మాత్రమే కాదు వాటితో పాటు గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు గుర్తింపు. గిరిజనుల స్థితిగతులను అధ్యయనం చేయడానికి ఉపయోగపడాలి. అందుకే అది గిరిజన ప్రాంతంలో మాత్రమే ఉండాలి. రెల్లికి తరలిస్తే వ్యతిరేకిస్తాం.

– పాలక రంజిత్, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర కార్యదర్శి, పార్వతీపురం

ప్రతిఘటిస్తాం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు సంబంధించి సముచితమైన నిర్ణయం తీసుకుంది. వర్సిటీ ఏర్పాటుచేసే ప్రాంతం చుట్టూ గిరిజన ఆవాసాలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. విద్యార్థులు కూడా ఈ ప్రాంతంలోనే ఉన్నారు. వర్సిటీ తరలింపునకు ప్రయత్నిస్తే ప్రతిఘటిస్తాం.

– ఎం.తిరుపతిరావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, సీతంపేట

కూటమి హింసాత్మక పాలన దేశానికి తెలిసింది

- ఢిల్లీలో వైఎస్సార్ సీపీ ధర్నా విజయవంతం
- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అరాచక పాలనపై ఢిల్లీలో వైఎస్సార్‌సీపీ చేపట్టిన ధర్నా విజయవంతమైందని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలోని తన స్వగృహంలో విలేకర్లతో ఆయన గురువారం మాట్లాడారు. కూటమి పాలనలో ఎక్కడ చూసినా హత్యలు, అత్యాచారాలు, దౌర్జన్యాలు, దాడులు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల ధ్వంసం, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను వెంటాడడం, హింసాకాండ తదితర వాస్తవాలను వివరిస్తూ ఢిల్లీలో చేపట్టిన నిరసన ప్రదర్శనకు దేశప్రజలు, వివిధ రాజకీయ పార్టీల మద్దతు లభించిందన్నారు. అరాచకపాలనపై మేధావి వర్గం సైతం విచారం, ఆశ్చర్యం, బాధను వ్యక్తం చేసిందన్నారు. రాష్ట్రంలో ఓ వైపు మారణ హోమం సాగిస్తూ మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, టీడీపీ నాయకులు మీడియా ముందు శాంతివచనాలు వల్లెవేయడంపై మండిపడ్డారు. మీకు కోపముంటే నన్ను చంపండి కాని అమాయక ప్రజలను, కార్యకర్తలను ఏమీ అనవద్దని జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారంటే ఆయన ఎంత మనోవేదనకు గురయ్యారో అర్థమవుతుందన్నారు. రాష్ట్రంలో హింసాత్మక పాలనపై ఢిల్లీలో చేపట్టిన ధర్నాలో ప్రదర్శించిన ఫొటో, వీడియో ప్రదర్శనను చూస్తే రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, కేంద్రహోంశాఖమంత్రికి వాస్తవం అర్థమవుతుందన్నారు.

సామాన్య ప్రజలపైనే విమర్శలా...

శాసనసభలో విష్ణుకుమార్‌రాజు ప్రజలపై చేసిన విమర్శలు ఆయన అధికార అహంకారానికి నిదర్శనమని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసిన ప్రజలు అన్నం తింటున్నారా... అని సంబోధిస్తూ సామాన్య ప్రజలను కించపరచడంపై ఆవేదన వ్యక్తంచేశారు. మరి ఆయన, సభలో ఉన్న మిగిలిన ప్రజాప్రతినిధులు ఏం తింటున్నారని ప్రశ్నించారు. రాజకీయ పార్టీల నాయకులు ఒకరినొకరు విమర్శించుకోవడం సహజమని, ప్రజలను విమర్శిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవన్నారు. తక్షణమే మేనిఫెస్టోలో ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు మద్దిల గోవింద పాల్గొన్నారు.

సంతకం పెడితేనే వైద్యం!



- జిల్లా ఆస్పత్రికి ఇదేం మాయరోగం..
- సేవల్లో జాప్యం.. సిబ్బందిలో అలసత్వం
- అధిక శాతం కేసులను విజయనగరం, విశాఖకు పంపేస్తున్న వైద్యులు
- చిన్నపాటి సమస్యకైనా సంతకం పెట్టాలంటూ రోగుల బంధువులపై ఒత్తిడి

ప్రభుత్వం మారింది. సేవల్లోనూ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. రెండు నెలల కిందటి వరకు పల్లె, పట్టణ ప్రజలకు వేగంగా అందే సచివాలయ సేవలు ఇప్పుడు నెమ్మదించాయి. పేదకుటుంబాల పిల్లల చదువుకు ఆర్థిక కష్టాలు దూరం చేసే 'తల్లికివందనం' అమలులో జాప్యం నెలకొంది. ఈ జాప్యం అత్యవసరమైన వైద్యవిభాగాన్నీ తాకింది. ఆపద సమయాన వైద్యసేవలతో ఆదుకోవాల్సిన వారు రోగి బంధువులు సంతకం పెడితేనే వైద్యం చేస్తామని తెగేసి చెబుతుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ముందు వైద్యం అందించి ప్రాణాలు నిలపండి మహాప్రభో అంటూ వేడుకుంటున్నా కనికరించకపోవడం ఆవేదనకు గురిచేస్తోంది. తమకు సంతకాలే ప్రధానమంటున్న తీరును చూసి సభ్యసమాజం విస్తుపోతోంది.

సాక్షి, పార్వతీపురం మన్యం :

పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలపై కొన్ని ఉదాహరణలివి. కష్టంతో ఉన్న రోగిపై ఆదరణ చూపించాల్సింది పోయి, నిర్లక్ష్యంతో ప్రత్యక్ష నరకం చూపిస్తున్నారు. రోగి బంధువుల సహనానికి పరీక్ష పెడుతున్నారు. అత్యవసర కేసులకు సరిపడా వైద్యం ఇక్కడ ఇవ్వలేని సందర్భంలో విజయనగరం, విశాఖలకు రిఫర్ చేయవచ్చు. ఈ ఆస్పత్రిలో ఏ చిన్న సమస్యకైనా రిఫర్ చేసేస్తున్నారన్న ఆరోపణలు గత కొద్దిరోజుల నుంచి వినిపిస్తున్నాయి. దీంతో పాటు, వైద్య సిబ్బంది పనితీరుపైనా విమర్శలు వస్తున్నాయి. రోగుల పట్ల మానవతాదృక్పథంతో స్పందించడం లేదని గతంలోనే అనేక ఫిర్యాదులు వెళ్లాయి. ముఖ్యంగా రాత్రి వేళ విధుల్లో ఉన్న శిక్షణ నర్సులు చరవాణులకే పరిమితం అవుతున్నారు. వార్డుల్లో విధులు నిర్వహిస్తున్న వారు సైతం రోగులు ఇబ్బంది పడతారన్న ఆలోచన లేకుండా, చరవాణుల్లో వినోద కార్యక్రమాలు చూస్తూ ఆనందిస్తున్నారు. పెద్ద శబ్దాలతో వెకిలి కామెడీ షోలు చూస్తుండటం వల్ల తాము ఇబ్బంది పడుతున్నామని రోగులు చెబుతున్నా.. తిరిగి వారిపైనే దురుసుగా ప్రవర్తిస్తున్నారన్న ఫిర్యాదులు ఆస్పత్రి ఉన్నతాధికారులకు గతంలో వెళ్లాయి. దీనిపై కొద్దిరోజుల క్రితం కొంత మంది శిక్షణ నర్సులకు పనిష్మెంట్ కూడా ఇచ్చారని ఆస్పత్రి వర్గాలే చెబుతున్నాయి.

చిన్న కేసొచ్చినా రిఫర్ చేసేయ్!

ప్రస్తుతం జిల్లాలో వ్యాధులు విజృంభిస్తున్నాయి. మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు, డయేరియా, డెంగీ బాధితులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ప్రస్తుతం జిల్లా ఆస్పత్రిలో రోజుకు 550 నుంచి 700 వరకు ఓపీ నమోదవుతోంది. ఇందులో జ్వరపీడితులే 40 నుంచి 50 మంది వరకు ఉంటున్నారు. డయేరియాతో బాధపడుతూ వస్తున్న వారు పదుల సంఖ్యలో ఉంటున్నారు. చిన్నపాటి సమస్య అయినా రోజుల తరబడి ఉంచేయడం, లేదంటే వెంటనే విజయనగరం, విశాఖ కేజీహెచ్‌లకు రిఫర్ చేయడం ఇక్కడ సర్వసాధారణమైపోయింది. ఇక్కడ వైద్యం అందించిన కేసుల కంటే రిఫర్ చేసేస్తున్న కేసులే అధికంగా ఉంటున్నాయని తెలుస్తోంది. అంతదూరం వెళ్లలేక చాలామంది స్థానికంగా ఉండే ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి, చేతిచమురు వదిలించుకుంటున్నారు. ఇదే విషయమై కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ వద్ద ప్రస్తావించగా.. అత్యవసర కేసులనే రిఫర్ చేస్తుంటారని చెప్పారు. తాను ఒకసారి ఆస్పత్రిని సందర్శించి, అక్కడ పరిస్థితిని తెలుసుకుంటానని తెలిపారు.

'ఒడిశాకు చెందిన మమిత అనే విద్యార్థిని పార్వతీపురంలో చదువుతోంది. ఇటీవల కడుపునొప్పితో బాధ పడుతూ, అర్ధరాత్రి సమయంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి వెళ్లింది. విద్యార్థిని బంధువులకు ఆస్పత్రి సిబ్బంది కొన్ని పేపర్లు ఇచ్చారు. రోగికి ఏమైనా.. వైద్యులకు గానీ, వైద్య సిబ్బందికి గానీ సంబంధం లేదన్నది అందులోని సారాంశం. అక్కడ సంతకం చేసి ఇస్తేనే చికిత్స ప్రారంభిస్తామని తెగేసి చెప్పారు. విద్యార్థినితో వచ్చిన బంధువు సంతకం చేసి ఇచ్చిన తర్వాత చికిత్స ప్రారంభించారు. ఇంజెక్షన్ వేయగానే రోగికి ఒళ్లంతా దద్దుర్లు, వణుకు, కళ్లు తిరగడం వంటి సమస్య ఏర్పడింది. ఆ తర్వాత ఆస్పత్రి సిబ్బందిని ఎంత పిలిచినా.. అలానే ఉంటుందిలే అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని బంధువులు వాపోయారు.'

'ఒడిశాలోని నీలావడి నుంచి పుణ్యవతి అనే మహిళ అనారోగ్యంతో బాధ పడుతున్న తన కుటుంబ సభ్యులిద్దరిని జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చింది. ఒకరికి గుండె సంబంధిత సమస్య కాగా.. మరొకరికి మలేరియా. వీరికి కూడా ఇంజెక్షన్ వేసిన తర్వాత రియాక్షన్ ఇచ్చింది. వాంతులు అయ్యాయి. భయాందోళనకు గురైన ఆమె.. సిబ్బందిని ఎన్నిమార్లు పిలిచినా స్పందన ఉండేది కాదు. చికిత్స అందించాలని వేడుకున్నా స్పందించేవారు కాదు.. పిలిచినా వచ్చేవారు కాదు.. వారం రోజులకుపైగా ఆస్పత్రిలో ఉన్నాం. నరకయాతన అనుభవించాం' అంటూ పుణ్యవతి ఆవేదన వ్యక్తం చేసింది.

ఇటీవల పార్వతీపురం పట్టణానికి చెందిన ఓ వ్యక్తిని బంధువులు జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. సదరు వ్యక్తికి బ్రెయిన్‌లో సమస్య ఉందని చెప్పి వైద్యులు విశాఖకు రిఫర్ చేశారు. విశాఖకు తరలించిన కొద్దిసేపటికే ఆ వ్యక్తి మరణించాడు.



పార్వతీపురం జిల్లా ఆస్పత్రి


సేవలు మెరుగుపడాలి



కొద్దిరోజుల కిందట వైద్యం కోసం బంధువుల అమ్మాయిని తీసుకెళ్లాం. సంతకం చేస్తేనే చికిత్స అందిస్తామని సిబ్బంది తెగేసి చెప్పారు. వాస్తవానికి రోగి కడుపునొప్పితోనే బాధ పడుతోంది. ఆ మాత్రానికే సంతకం ఎందుకని ప్రశ్నిస్తే.. వారు అంగీకరించలేదు. అర్ధరాత్రి కావడంతో ఎక్కడికీ వెళ్లలేం. రోగికి ఇంజెక్షన్ వేసిన తర్వాత రియాక్షన్ ఇచ్చింది. సిబ్బందిని ఎన్నిసార్లు సంప్రదించినా స్పందించేవారు కాదు. మాలాంటి ఎంతోమంది ఇబ్బంది పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో సేవలు మెరుగుపడేలా చూడాలి.

– వైజయంతీమాల, పార్వతీపురం

సంతకం చేస్తేనే మందుబిళ్లయినా.. సూదిపోటైనా!



రోగి సంతకంతో తీసుకుంటున్న అంగీకార పత్రం

జిల్లా ఆస్పత్రిలో మరో విచిత్ర పరిస్థితి ఉంది. పగలైనా, రాత్రయినా, అత్యవసర పరిస్థితైనా.. వచ్చిన రోగులకు చికిత్స ప్రారంభించాలంటే, వారి బంధువులతో కచ్చితంగా సంతకం తీసుకుంటారు. రోగికి ఏమైనా తమకు సంబంధం లేదన్నది అందులోని సారాంశం. చిన్నపాటి అనారోగ్య సమస్యలకైనా ఇది తప్పనిసరి చేశారు. ఎవరైనా ఇదేంటని ప్రశ్నిస్తే.. చికిత్స చేయలేమంటూ పొమ్మంటున్నారని పలువురు రోగుల బంధువులు వాపోతున్నారు. లేదంటే ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేసేస్తున్నారని చెబుతున్నారు. చికిత్స సమయంలోనూ కొన్ని రకాల ఇంజెక్షన్లు ఇచ్చేస్తున్నారు. దీనివల్ల రోగులకు రియాక్షన్ సమస్య తలెత్తుతోంది.

క్లుప్తంగా

త్రుటిలో తప్పిన ప్రమాదం



108 వాహనంలో క్షతగాత్రుడు

కురుపాం: మండలంలోని మూలిగూడ జంక్షన్ వద్ద జీడిపిక్కల లారీకి గురువారం పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాలు.. జీడిపిక్కల లోడుతో గుమ్మలక్ష్మీపురం నుంచి తుని వెళ్తున్న భారీ లారీకి గురువారం ఉదయం 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలాయి. లారీ కేబిన్‌లో ఉన్న డ్రైవర్, క్లీనర్ విద్యుత్ షాక్‌కు గురయ్యారు. లారీ టైర్లు మంటల్లో కాలిపోతుండగా అదే సమయంలో విద్యుత్ ట్రిప్ కావడంతో సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రమాదం వారిద్దరూ బయటపడ్డారు. స్థానికులు వెంటనే క్షతగాత్రులను 108లో కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. క్షతగాత్రులు అక్కడ వైద్య సేవలు పొందుతున్నారు.

సీజ్ చేసిన మద్యం ధ్వంసం



మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న పోలీసు సిబ్బంది

పాలకొండ: పలు కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం, సారాను గురువారం ధ్వంసం చేశారు. 436 లీటర్ల సారాను కాలువల్లో పారబోసారు. అలాగే 458 మద్యం సీసాలను ధ్వంసం చేశారు. రెవెన్యూ, పోలీసుల సమక్షంలో ఉదయం పోలీసుస్టేషన్ ఆవరణలో మద్యం సీసాల బహిరంగంగా ఉంచి వాటిని సిబ్బంది కాలువల్లో పారబోసారు. సీఐ చంద్రమౌళి, ఎస్ఐ ప్రశాంత్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ యువత మత్తు పానీయాలకు అలవాటు పడకూడదని, సారా, గంజాయి వంటి వాటిని వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాలికపై కుక్కల దాడి



కుక్కల దాడిలో గాయపడిన పూర్ణ చంద్రిక

సంతకవిటి: మండల పరిధి మిర్తివలస గ్రామానికి చెందిన కొంచాడ పూర్ణ చంద్రిక(9)పై గురువారం కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. గ్రామంలోని పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న చంద్రిక పాఠశాల నుంచి ఇంటికి వస్తున్న సమయంలో కుక్కలు దాడి చేశాయి. బాలిక కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుక్కలను తరమడంతో ప్రమాదం తప్పింది. అనంతరం చికిత్స కోసం శ్రీకాకుళంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామంలో కుక్కలను నివారించాలని గ్రామస్తులు అధికారులను కోరారు.

ఇద్దరికి గాయాలు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం గ్రామంలో రెండు రోజుల్లో కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలయ్యాయి. బుధవారం కారాడ శ్రీను కుక్క కాటుకు గురి కాగా, గురువారం కర్రి పోలమ్మపై దాడి చేశాయి. పోలమ్మను చినమేరంగి సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన చికిత్స కోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మృత్యు ఒడిలో విద్యార్థులు

- మన్యంలో విజృంభిస్తున్న మలేరియా
- నెల రోజుల వ్యవధిలో ముగ్గురు విద్యార్థుల మృతి
- జ్వర పీడితులతో అల్లాడుతున్న మన్యం



పార్వతీపురం టౌన్: వర్షాకాలం వచ్చిందంటే చాలు మన్యంలో మలేరియా విజృంభిస్తోంది. గిరిజనులు, ముఖ్యంగా విద్యార్థులు మలేరియా దోమ కాటుకు గురై జ్వరాల బారిన పడుతున్నారు. ఆస్పత్రులకు వెళ్తున్న వీరికి మలేరియా మందులు అందుబాటులో లేకపోవడంతో సరైన వైద్యమందక మృత్యువాత పడుతున్నారు. రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు గిరిజన విద్యార్థులు మృతి చెందారు. ఈ నెల 21న గుమ్మలక్ష్మీపురం మండలం వంగర గ్రామానికి చెందిన నాలుగో తరగతి విద్యార్థి ఎం.గౌతమ్ మలేరియా జ్వరంతో మరణించాడు. తాడికొండ పీహెచ్‌సీకి వైద్యం కోసం తీసుకువెళ్లగా మలేరియా మందులు అందుబాటులో లేవని సాధారణ మాత్రలతో సరిపెట్టారని బాలుని తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. ఈ నెల 7న జొయ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురం గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న బి.ఈశ్వరరావు మలేరియాతో మృతి చెందాడు. మలేరియా మరణాలు జరుగుతున్నా ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నివారణా చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమయ్యారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

జ్వర పీడితులతో అల్లాడుతున్న మన్యం

సీతంపేట, సాలూరు, భద్రగిరి ఏజెన్సీ ప్రాంతాల్లో జ్వర పీడితుల రాకతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులతో వందలాది సంఖ్యలో రోగులు వైద్యం కోసం ఆస్పత్రులకు వస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో సరైన వైద్యమందక మలేరియా జ్వరంతో విద్యార్థులు మృత్యు ఒడికి చేరుతూనే ఉన్నారు. చదువుకొనే పసిప్రాయంలో చిన్నారులు మరణించడంతో తల్లిదండ్రులకు కడుపు శోకం తప్పడం లేదు. ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా మందులు అందుబాటులో లేకపోవడంతో గిరిజనులకు మలేరియా వైద్యం అందని ద్రాక్షగా మిగిలింది. ఆర్థికంగా ఉన్న వారు ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. నిరుపేదలు ప్రభుత్వ వైద్యంపైనే ఆధార పడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో మలేరియా నివారణకు చర్యలు ప్రభుత్వం చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. వర్షాకాలంలో పెరుగుతున్న రోగుల దృష్ట్యా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మలేరియా, డెంగీ మందులు అందుబాటులో ఉంచి స్థానికంగా మెరుగైన వైద్య సేవలందించే దిశగా చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

మరో విద్యార్థి మృతి

మండలంలోని రావికొన గిరిజన సంక్షేమ వసతిగృహ విద్యార్థి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మక్కువ మండలం దుగ్గేరుకు చెందిన పి.రాఘవ ఈ నెల 13న తన కుటుంబీకులతో కలిసి దుగ్గేరు వెళ్లాడు. విద్యార్థి కోసం ఈ నెల 16న హాస్టల్ వార్డెన్ ఫోన్‌లో సంప్రదించగా జ్వరంతో పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. వెంటనే ఆయన స్పందించి ఆస్పత్రికి వెళ్లగా, వైద్యులు విద్యార్థిని విజయనగరం ఘోషాస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ వారు కూడా మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ విషయాన్ని వార్డెన్ ఐటీడీఏ అధికారులు దృష్టిలోకి తీసుకువెళ్లి వారి సూచనల మేరకు ఈ నెల 17న కేజీహెచ్‌లో చేర్చారు. అక్కడ వైద్యం ఈ నెల 21న విద్యార్థి మృతి చెందాడు. విద్యార్థి మృతికి కారణం సెరిబ్రెల్ మలేరియాగా వైద్యులు గుర్తించినట్లు తెలిపారు. జిల్లాలో వైరల్ జ్వరాలతో సంక్షేమ వసతిగృహ విద్యార్థులు వరుస మరణాలు జరుగుతుండడంతో వసతిగృహాల్లో ఏఎన్ఎంల నియామకం వెంటనే జరగాలని విద్యార్థుల తల్లి దండ్రులు కోరుకుంటున్నారు.

విద్యార్థి కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలి



విద్యార్థుల ఆరోగ్యంతో ప్రభుత్వం చెలగాటమాడుతుంది. వసతిగృహాల్లో సీజనల్ వ్యాధుల పట్ల కనీస చర్యలు చేపట్టడం లేదు. ఇంత జరుగుతున్నా పాలకుల్లో గిరిజన విద్యార్థుల ప్రాణాలు కాపాడాలనే చిత్తశుద్ధి కనిపించడం లేదు. తక్షణమే గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు, కళాశాల వసతి గృహాలకు ఏఎన్ఎంలను నియమించాలి. మృతి చెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం చెల్లించాలి.

– పాలక రంజిత్‌కుమార్, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి

‘ఫెడెక్స్, బ్లూడాట్’ పేరుతో వచ్చే కాల్స్ పట్ల తస్మాత్..

- ఎస్పీ వకుల్ జిందాల్



ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: ఫెడెక్స్, బ్లూడాట్ కొరియర్స్ పేర్లతో వచ్చే కాల్స్, లింక్స్, వీడియో కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల సైబర్ మోసగాళ్లు మొబైల్స్‌కు ఫోన్ చేసి తాము ఫెడెక్స్ లేదా బ్లూడాట్ కొరియర్స్ నుంచి మాట్లాడుతున్నామని, మన చిరునామా, ఆధార్ నెంబర్, ఫోన్ నంబరు వంటి కొంత సమాచారాన్ని ముందుగా మనకు తెలిపి, మనం బుక్ చేసిన కొరియర్ పార్సిల్‌లో నిషేధిత మాదక ద్రవ్యాలు, ఫేక్ పాస్‌పోర్ట్, బంగారం బిస్కెట్లు ఉన్నాయని, మనీ ల్యాండరింగ్‌కు పాల్పడుతున్నట్లుగా గుర్తించినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాలను థైవాన్, ఇరాన్, చైనా వంటి దేశాలకు పంపుతున్నారని నిర్ధారణయ్యిందని, కేసు కూడా నమోదైందని పేర్కొన్నారు. విచారణ నిమిత్తం తాము సూచించిన సుదూర ప్రాంతానికి దర్యాప్తు నిమిత్తం రావాల్సి ఉంటుందన్న సమాచారాన్ని అందిస్తారన్నారు. ఇటువంటి కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలందరూ సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. సైబర్ నేరాల్లో ఎవరైనా నగదు పోగొట్టుకున్నట్లయితే 1930కు లేదా నేషనల్ క్రైమ్ పోర్టల్‌లో రిపోర్టు చేయాలని కోరారు.

జాతీయ తైక్వాండో పోటీల్లో విజేతలుగా నిలవాలి



ఎంపికైన క్రీడాకారులతో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వరరావు

- జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వరరావు

విజయనగరం: జాతీయ స్థాయిలో జరగనున్న తైక్వాండో పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులు విజేతలుగా నిలవాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. ఈ నెల 25 నుంచి 31 వరకు విజయనగరం వేదికగా నిర్వహిస్తోన్న రాష్ట్ర స్థాయి కోచింగ్ క్యాంప్‌ను ఆయన రాజీవ్ క్రీడా మైదానంలో ప్రారంభించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్యాంప్‌లో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 25 మంది క్రీడాకారులకు క్యాడెట్ విభాగంలో శిక్షణ ఇవ్వటం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు చదువుతో క్రీడల్లో రాణించటం ముఖ్యమేనని తెలిపారు. తద్వారా ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోగలరని సూచించారు. క్రీడల్లో రాణించే వారికి మంచి ఆరోగ్యంతో పాటు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆత్మరక్షణ విద్య తైక్వాండో పిల్లలను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఏపీ తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి డీవీ.చారి, కోచ్‌లు టి.రాము, ఎ.అకిల్, ఎస్.రవి, వినీష్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువలపై ప్రత్యేక పర్యవేక్షణ

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



తోటపల్లి ప్రాజెక్టు స్పిల్‌వేను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: తోటపల్లి ప్రాజెక్టు మట్టి కట్టలు, ప్రధాన కాలువలు కోతకు గురికాకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ జల వనరుల శాఖ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు ప్రధాన కుడి కాలువ, స్పిల్‌వే రెగ్యులేటర్ నీటి ప్రవాహ స్థాయిని గురువారం పరిశీలించారు. తోటపల్లి ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటరీ వద్ద మిషనరీ కాంపోనెంట్స్, సాగునీటి విడుదల చేసే గేటులను పరిశీలించారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టు వద్ద నీటి నిల్వ స్థాయి, ప్రాజెక్ట్ కింద ఆయకట్టుకు అందుతున్న సాగునీరు, విస్తీర్ణం, మిగుల జలాల విడుదల, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద ముంపు గ్రామాలు, తదితర విషయాలపై ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువ ఇరువైపులా ఉండే బండలను వర్షాల వల్ల కోతకు గురి కాకుండా ప్రత్యేక పర్యవేక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రాజెక్టులో పేరుకుపోయిన గుర్రపుడెక్క నివారణకు శాస్త్రీయ, సాంకేతిక శాశ్వత పరిష్కారం కనుగొనాలని సూచించారు. తోటపల్లి ప్రాజెక్టు కాలువల నిర్వహణ పక్కాగా చేపట్టాలని అన్నారు. తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టు, కాలువల నిర్వహణకు లష్కర్ల కొరత ఉన్నందున శాశ్వత ప్రాతిపదికన నియమించాల్సి ఉందని, తోటపల్లి పిల్ల కాలువల తవ్వకం కోసం భూమి సేకరించాల్సి ఉందని, కుడి ప్రధాన కాలువల కొన్ని రీచ్‌ల వద్ద సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులు జరిపించాలని కలెక్టర్ దృష్టికి ఇంజినీరింగ్ అధికారులు తీసుకువచ్చారు. సాగునీటి కాల్వ పనులకు సక్రమంగా నిధులు వినియోగానికి తగిన యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆయన వెంట జల వనరుల శాఖ ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ రఘునందన్, జేఈ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో ధరల పట్టికలు ఏర్పాటు చేయాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు, ఫిజియోథెరపి క్లినిక్‌లు, స్కానింగ్ సెంటర్లు విధిగా టారిఫ్ బోర్డులు (ధరల పట్టిక) తెలుగు, ఇంగ్లిష్‌లో పెట్టాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ధరల బోర్డులు పెట్టని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి స్కాన్ సెంటర్, ఆస్పత్రులు, క్లినిక్స్, డయాగ్నోస్టిక్ సెంటర్లు ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం నిర్వహించాలని తెలిపారు. ఇంతవరకు వైద్య శాఖ అనుమతి తీసుకోని వారు తక్షణమే తీసుకోవాలన్నారు.

జూనియర్ సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది జెడ్పీహెచ్ పాఠశాలలో ఈ నెల 27న సాఫ్ట్‌బాల్ జూనియర్ క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ ఐ.విజయకుమార్ గురువారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను శ్రీకాకుళంలో ఆగస్టు 17, 18 తేదీల్లో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనాలని ఆసక్తి ఉన్న బాలబాలికలు 2007 జనవరి 1 తరువాత పుట్టిన వారు అర్హులని తెలిపారు.

31న ‘వీఆర్ఎస్’ ద్వారా సాగునీరు విడుదల



వీఆర్ఎస్ నీటిమట్టం పరిశీలించి, నీటి విడుదలపై చర్చిస్తున్న ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు

మక్కువ: వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్ సువర్ణముఖి, గోముఖి రెగ్యులేటర్ల నుంచి ఈ నెల 31వ తేదీన కాలువలకు సాగునీరు విడుదల చేసేందుకు గురువారం ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు చర్చించి నిర్ణయం తీసుకున్నారు. వీఆర్ఎస్ ప్రాజెక్టును ఇరిగేషన్ ఈఈ ఆర్.అప్పలనాయుడు, డీఈ డి.సురేష్, జేఈలు, టీడీపీ మండలాధ్యక్షుడు గుళ్ల వేణుగోపాలరావు పరిశీలించారు. ప్రాజెక్ట్‌లో ప్రస్తుత నీటిమట్టం, కాలువలు పరిస్థితిపై చర్చించారు. ఈ నెల 31న గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి నీటిని విడుదల చేయనున్నట్లు ఈఈ ఆర్.అప్పలనాయుడు తెలిపారు. కాలువల ద్వారా పంట పొలాలకు సాగునీరు సక్రమంగా సరఫరా చేసేందుకు జేసీబీ సహాయంతో పూడికలు తీయిస్తున్నట్లు తెలిపారు.

300 క్యూసెక్కుల నీరు విడుదల

గోముఖి రెగ్యులేటరు ద్వారా గోముఖినదిలోకి గురువారం 300క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు వీఆర్ఎస్ జేఈ శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల వర్షాలు కురుస్తున్నందున ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో చేరడంతో, ముందస్తు చర్యల్లో భాగంగా గోముఖి నదిలోకి నీటిని విడిచిపెట్టినట్లు ఆయన తెలిపారు.

మహిళ ఆత్మహత్య

మెంటాడ: మండలంలోని మీసాలపేటకు చెందిన వివాహిత క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ తెలిపిన వివరాలు... గ్రామంలోని గంట్యాడ స్వాతి(27)కి ఏడేళ్ల కిందట సత్యనారాయణతో వివాహం జరిగింది. వీరికి ఐదేళ్ల కుమార్తె ఉంది. కొంత కాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. ఈ క్రమంలో గురువారం ఉదయం స్వాతితో భర్త సత్యనారాయణ గొడవ పడి పనుల నిమిత్తం బయటకు వెళ్లాడు. ఆ కోపంలో స్వాతి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

చికెన్		
బ్రాయిలర్		
లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹112	₹194	₹204

గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితులతో ఎస్ఐ

పాచిపెంట : మండలంలో పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద నలుగురు వ్యక్తుల నుంచి 3.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నారాయణ గురువారం తెలిపారు. పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేపడుతుండగా, నలుగురు వ్యక్తుల నుంచి 3.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఒడిశా, తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌లకు చెందిన నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

బంగారం చోరీ



గజపతినగరం: బీరువా వద్ద వేలి ముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం, చిత్రంలో సీఐ, ఎస్ఐ



బొబ్బిలి రూరల్: దర్యాప్తు చేస్తున్న పోలీసులు

గజపతినగరం : మండల కేంద్రంలో పాత ఎంపీడీఓ కార్యాలయం రోడ్డులో పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఓ ఇంట్లో బుధవారం రాత్రి దొంగలు చొరబడి బంగారాన్ని దోచుకెళ్లారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. పి.రాము కొన్నాళ్లుగా ఎంపీడీఓ కార్యాలయం రోడ్డులో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఆయన ఇటీవల మండల వారి కాలనీలో నూతనంగా ఇల్లు నిర్మించాడు. రాము, భార్య స్వప్న, పిల్లలు పగలు అద్దె ఇంట్లో ఉంటూ రాత్రి కొత్తగా నిర్మించిన ఇంటికి వెళ్తున్నారు. ఎప్పటిలాగే బుధవారం రాత్రి కూడా కొత్త ఇంటికి వెళ్లారు. దీన్ని గుర్తించిన దొంగలు ఇంటి తలుపులు విరగ్గొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాలను విరగ్గొట్టి కొంత బంగారాన్ని దొంగలించుకుపోయారు. గురువారం ఉదయం రాము దొంగతనం జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జిల్లా నుంచి క్లూస్ టీం అధికారి మురళి, సీఐ ఎస్‌వీ ప్రభాకరరావు, ఎస్ఐ యు.మహేష్ తదితరులు సంఘటనా స్థలానికి చేరుకొని వేలిముద్రలను సేకరించారు. దొంగతనం జరిగిన వివరాలను బాధిత కుటుంబ సభ్యుల నుంచి అడిగి తెలుసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

8 తులాల బంగారం చోరీ

బొబ్బిలి రూరల్: మండలంలోని గొర్లెసీతారాంపురం గ్రామంలో 8తులాల బంగారం చోరీకి గురైందని బాధితులు ఫిర్యాదు చేశారు. బుధవారం జరిగిన ఈ సంఘటనపై ఎస్ఐ లోవరాజు దర్యాప్తు నిర్వహించారు. గ్రామంలో జలుమూరి అరుణ ఇంట్లో ఈ ఘటన జరిగినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ నెల 20న తన ఇంట్లో బీరువాలో బంగారం పెట్టినట్లు 23వ తేదీన బీరువా తెరచి చూస్తే అది కనిపించలేదని ఫిర్యాదు అందినట్టు ఎస్ఐ చెప్పారు. ఇది ఇంటి దొంగల పనేనన్న అనుమానం ఉందని ఎస్ఐ తెలిపారు. క్లూస్‌టీంలను రప్పించి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.



చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రామభద్రపురం: విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయం వద్ద ఈ నెల 16న గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. దాంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ పరిశీలించి చికిత్స నిమిత్తం 108 వాహనంలో బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ జ్ఞానప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి బంధువులెవరైనా ఉండి వస్తే పోస్టుమార్టం అనంతరం మృతదేహం అప్పగిస్తారని ఎస్ఐ తెలిపారు.

పంట కాలువలోకి దూసుకెళ్లిన కారు



ప్రమాదానికి గురైన మారుతీ వ్యాన్

శృంగవరపుకోట: మండలంలో విశాఖ – అరుకు రోడ్డులో గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో రాజీపేట గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మారుతీ వ్యాన్ ప్రమాదానికి గురైంది. బొడ్డవర నుంచి ఎస్.కోట వైపు వస్తున్న మారుతీ వ్యాన్‌లో ఏడుగురు ప్రయాణికులు ఉన్నారు. వ్యాన్ ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డు పక్కనున్న పంట కాలువలోకి దూసుకుపోయింది. కాగా వాహనంలో ఉన్న వారికి, రోడ్డుపై ఎవ్వరికీ ఎటువంటి ప్రమాదం జరగపోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల సహాయంతో వ్యాన్ బయటికి తీశారు.

పరిశుభ్రతే ప్రధానం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని, ప్రతీ గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీఓలు, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులతో గురువారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మలేరియా కేసులు నమోదైతే వైద్యాధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాలను శుక్రవారం విస్తృతంగా నిర్వహించాలన్నారు. ప్రత్యేకాధికారులు పారిశుద్ధ్య నిర్వహణను, పాఠశాలలోని విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించాలని తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ మాట్లాడుతూ ఇంతవరకు 340 గ్రామ పంచాయతీల్లోను, 951 గ్రామాల్లోను పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. తాగునీటి పథకాలను శుభ్రపరచడం, క్లోరినేషన్ చేయడం జరుగుతుందన్నారు. నీటి నిల్వలు ఉండే ప్రదేశాలను గుర్తించి పారిశుద్ధ్య నిర్వహణ చేయాల్సివుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఓ.ప్రభాకర్‌రావు, జిల్లా ప్రణాళిక అధికారి పి. వీర్రాజు తదితరులున్నారు.